శ్రీ ప్రణవ పీఠం, ఏలూరు వారి

# ప్రణవ పద్మాకరం

శ్రీ ప్రణవపీఠం
ఏలూరు



ఫిబ్రవరి, 2022

ప్రణవ పద్మాకర

శ్రీ ప్రణవపీఠం. ఏలూరు

బ్రహ్మశ్రీ వద్దిపర్తి పద్మాకర్

# ప్రణవ పద్మాకరం

శ్రీ ప్రణవపీఠం వారి మాసపత్రిక

ఫిబ్రవరి, 2022

సంచిక-2

సంపుటి-1


## విషయ సూచిక


| | | |
|---|---|---|
| సంపాదకీయం 1<br>బ్రహ్మశ్రీ వద్దిపర్తి పద్మాకర్ | శ్రీ గణేశ పురాణం 2<br>శ్రీమతి పాలగుమ్మి (వద్దిపర్తి) శ్రీవిద్య | శ్రీ వేంకటేశ్వర రహస్యం 3<br>శ్రీమతి నడుముక్కల (వద్దిపర్తి) శ్రీకరి |
| ఋషిచరిత్ర 6<br>శ్రీ ప్రణవపీఠం శిష్యబృందం | ఐశ్వర్యయోగం 7<br>బ్రహ్మశ్రీ వద్దిపర్తి పద్మాకర్ | పురాణంలో మహిళలు 8<br>శ్రీ ప్రణవపీఠం శిష్యబృందం |
| స్తోత్రమాలిక 10<br>బ్రహ్మశ్రీ వద్దిపర్తి పద్మాకర్ | రథ సప్తమి & 12<br>సరస్వతీ పంచమి విశేషాలు<br>బ్రహ్మశ్రీ వద్దిపర్తి పద్మాకర్ | సత్సంగ సమాచారము 20<br>శ్రీ ప్రణవపీఠం శిష్యబృందం |


పూజ్య గురుదేవులు బ్రహ్మశ్రీ వద్దిపర్తి పద్మాకర్ గురువుగారికి జయము జయము

శ్రీ మహాగణాధిపతయే నమః     శ్రీ గురుభ్యోనమః     శ్రీ మాత్రేనమః

పూజ్య గురువులు బ్రహ్మశ్రీ వద్దిపర్తి పద్మాకర్ గారి ప్రవచనముల కొఱకు, శ్రీ ప్రణవపీఠం సమాచారము కొఱకు క్రింద ఇవ్వబడిన వెబ్సైటు ను సందర్శించగలరు.

https://srivaddipartipadmakar.org

© All copyrights are reserved with Sri Pranava Peetam, Eluru.


# ప్రణవ పద్మాకరం

శ్రీ ప్రణవపీఠం వారి మాసపత్రిక




## సంపాదకీయం

### శ్రద్ధావాన్ లభతే జ్ఞానం



పెద్దల యందు, గురువుల యందు ప్రగాఢ విశ్వాసం ఉండాలి. వారి మాటలను భక్తితో విని సాధ్యమైనంత వరకు పాటించాలి. వేదశాస్త్రాలపై విశ్వాసం ఉండాలి. దీనిని శ్రద్ధ అంటారు. ఇది ఒక అద్భుతశక్తి, బుద్ధి విశేషం కూడా. శ్రద్ధ సాక్షాత్తుగా దేవీస్వరూపం.

మనం చేసే పనిని శ్రద్ధతో చేసినట్లయితే, ఆ పనిలో విశ్వాసం, సమర్థత పెరుగుతాయి. తద్వారా సత్ఫలితాలను పొందగలం. మనం చేసే పని మీద ఉండే ప్రేమయే శ్రద్ధ. శ్రద్ధతో చేసే ఏ కార్యమైనా తపస్సుతో సమానం. మనం నిత్యజీవితంలో చేసే అర్చన,ధ్యాన, దాన,జప,మంత్రానుష్ఠానాలలోనూ, నిత్యనైమిత్తికక్రియలు అన్నింటిలోనూ కూడా తప్పక ఉండవలసినది శ్రద్ధ.

'శ్రద్ధావాన్ లభతే జ్ఞానం' అని భగవద్గీతలో శ్రీకృష్ణ పరమాత్ముడు సందేశమిచ్చాడు. శ్రద్ధతో పెద్దలు, గురువులు సూచించిన వేదశాస్త్ర విషయాలను భక్తితో ఆచరించినట్లయితే జ్ఞానం పెంపొంది మనం చేసే ప్రయత్నాలకు లక్ష్యశుద్ధి కలుగుతుంది. అప్పుడు మనం చేసే పనులలో విజయం లభిస్తుంది. శ్రద్ధ లేని పనులు వ్యర్థాలు.

భక్తిభావనను, ఆధ్యాత్మిక పరిణతిని పెంచే శ్రద్ధను పరాశక్తి సకల జనులకు అనుగ్రహించుగాక......

వద్దిపర్తి పద్మాకర్

# ప్రణవ పద్మాకరం

శ్రీ ప్రణవపీఠం వారి మాసపత్రిక


## శ్రీ గణేశ పురాణం

శ్లో॥ సుముఖశ్చైకదంతశ్చ , కపిలో గజకర్ణకః
లంబోదరశ్చ వికటో, విఘ్నరాజో గణాధిపః
ధూమకేతుః గణాధ్యక్షః ఫాలచంద్రో గజాననః
వక్రతుండః శూర్పకర్ణః హేరంబః స్కందపూర్వజః
షోడశైతాని నామాని యః పఠేత్ శృణుయాదపి
విద్యారంభే వివాహేచ ప్రవేశే నిర్గమే తథా
సంగ్రామే సర్వకార్యేషు విఘ్నః తస్య నజాయతే ॥

విఘ్నేశ్వరునికి అనంత నామాలున్నాయి. అనేక అవతారాలున్నాయి. ఆయన లీలా గాథలు కూడా అనంతాలే. విఘ్నేశ్వరుడు నిర్గుణుడూ, సగుణుడు కూడా. అటువంటి గణేశ్వరునికి బాగా ఇష్టమైన పదహారునామాలు ఉన్నాయని, ఆ పదహారు నామాలని భక్తితో తలచుకుంటే సకలశుభాలు కలుగుతాయని వ్యాసమహర్షి సెలవిచ్చాడు.

విఘ్నేశ్వరుని పదహారునామాలు:

| | |
|---|---|
| 1. సుముఖుడు | 9. ధూమకేతుడు |
| 2. ఏకదంతుడు | 10. గణాధ్యక్షుడు |
| 3. కపిలుడు | 11. ఫాలచంద్రుడు |
| 4. గజకర్ణకుడు | 12. గజాననుడు |
| 5. లంబోదరుడు | 13. వక్రతుండుడు |
| 6. వికటుడు | 14. శూర్పకర్ణుడు |
| 7. విఘ్నరాజు | 15. హేరంబుడు |
| 8. గణాధిపుడు | 16. స్కందపూర్వజుడు |

గత సంచికలో సుముఖుడు అను నామమునకు విశేషాలు తెలుసుకున్నాం. ఈ సంచిక లో రెండవ నామము యొక్క వివరాలు తెలుసుకుందాం.

### (2) ఏకదంతుడు

అనేక గుణములతో విఘ్నేశ్వరుడు ఏకదంతుడు అయ్యాడు. అందులో ఒక గుణకథను గురించి తెలుసుకుందాం. ఒకప్పుడు పరశురాముడు శివపార్వతుల దర్శనానికి కైలాసానికి వచ్చాడు. ఆ సమయంలో ఎవరినీ లోనికి పంపవద్దని శివుడు గణేశుని కాపలాగా పెట్టడం వల్ల గణేశుడు పరశురాముని అడ్డుకున్నాడు. పరశురాముడు పరమ శివభక్తుడు. అతనికి శివుడు ఒకప్పుడు గండ్రగొడ్డలి ఇస్తూ " ఈ గొడ్డలి అమోఘమైనది అవుతుంది" — అని వరమిచ్చాడు. ఆ పరశువును శివదర్శనానికి వెళ్ళకుండా తనను అడ్డుకున్న గణేశునిపై భార్గవరాముడు ప్రయోగించాడు. దానివల్ల గణేశుని ఒక దంతము విరిగిపోయింది. అప్పుడు పరశురాముడు విఘ్నేశ్వరుని భక్తితో ప్రార్థించి, మరల ఆ దంతాన్ని అతికించుకోమని కోరగా, గణపతి పరశురామ పరాక్రమానికి చిహ్నంగా ఏకదంతుడనై ఉంటానని పరశురామునికి శివానుగ్రహం కలుగుతుందని వరమిచ్చాడు. అంతేకాక ఆ దంతం ఎప్పుడు కావాలంటే అప్పుడు అతుకుకొని ఉంటుందని, మరల దానిని విరిచి సత్కార్యానికి ఉపయోగిస్తానని లోకానికి వరమిచ్చాడు. ఈ విధంగా ఆయన ఏకదంతుడు అయ్యాడు.



# ప్రణవ పద్మాకరం

శ్రీ ప్రణవపీఠం వారి మాసపత్రిక

గణేశతత్త్వాన్ని గురించి అనేక పురాణాలు, ఇతిహాసాలు, సంహితలు, ఉపనిషత్తులు వర్ణించాయి. ఏకదంత శబ్దానికి ఆయా గ్రంథాలలో వివిధ నిర్వచనాలున్నాయి. ఈ నిర్వచనాలను స్వీకరించేటపుడు ఒక్క విషయం మాత్రం గుర్తుంచుకోవాలి. ఈ నిర్వచనాలలో ఏవైనా వ్యాసుడు వ్రాసిన పురాణేతిహాసాలకు వ్యతిరేకంగా ఉన్నప్పుడు మాత్రం, వాటిని అంగీకరించరాదు. వేదవ్యాసుని గ్రంథాలను అంగీకరించేవాటినే స్వీకరించాలి అని కంచి పరమాచార్యులు శ్రీశ్రీశ్రీ చంద్రశేఖర సరస్వతీస్వామి వారు బోధించారు. దానికొక ఉదాహరణ కూడా వారిచ్చారు. బ్రహ్మవైవర్తపురాణంలో గణపతి, తులసిని శపించి, తులసి తన పూజకు పనికిరాదన్నాడు. దీనికి వ్యతిరేకంగా ముద్గలపురాణంలో తులసితో గణపతిని పూజించవచ్చని ఉన్నది. అటువంటపుడు, వ్యాసుని అష్టాదశపురాణాలలో ఒకటి అయిన బ్రహ్మవైవర్తపురాణానికి వ్యతిరేకంగా ఉన్న ఈ ముద్గలపురాణధర్మాన్ని స్వీకరించకూడదు. వ్యాసుడు చెప్పిన దానికి వ్యతిరేకంగా నడచుకోవడం వేదవ్యతిరేక ధర్మమే అని సాక్షాత్తుగా సద్గురువులు చెప్పినపుడు కాదని ఎవరైనా ఎలా అనగలరు? వ్యాసునికి అనుకూలంగా ముద్గలుడు గణేశుని నామాలలో ఒకటి అయిన ఏకదంత శబ్దాన్ని ఇలా నిర్వచించాడు.

శ్లో|| ఏకశబ్దాత్మికా మాయా తస్యాః సర్వసముద్భవమ్
దంతః సత్తాధరస్తత్ర మాయా చాలక ఉచ్యతే ||

'ఏక' అనేక శబ్దానికి మాయ అని అర్థం. దంతశబ్దానికి 'మాయిక' అనగా మాయను ధరించే శక్తి కలది అని అర్థం. ఏకదంతుడు అనగా మాయను తన అధీనంలో ఉంచుకొని మాయను ధరించి, దానిని తన ఇష్టం వచ్చినట్లు నడపగలిగేవాడు అని అర్థం. ఏకదంతుడు అనగా అద్వైతస్వరూపుడు అని అర్థం. ఎప్పటికైనా జీవుడు పరమాత్మునిలో లీనం కావలసిందేనని బోధించే దివ్యతత్త్వమే ఏకదంతుడు. జీవితానికి ఒకే ఒక లక్ష్యం ఉండాలి. ఆ లక్ష్యం సాధించాలి అని బోధించే జ్ఞానాన్ని ఏకదంతుడు అంటారు. స్త్రీ,బాల,వృద్ధులు అనే తేడా లేకుండా అందరికీ ఓదార్పును కలిగిస్తూ, భక్తులను రక్షిస్తూ, సర్వసంపదలనూ వారివారి అర్హతలకు తగిన విధంగా అందించే ఏకైక శక్తిని కూడా ఏకదంతుడనే పిలుస్తారు.

...ఇంకా ఉంది

******

## శ్రీ వేంకటేశ్వర రహస్యము

క|| శ్రీకర! వేంకటగిరి శో
భాకర! శ్రీ శ్రీకరీశుభాకర! శ్రుతి వి
ద్యాకర! శాశ్వత ధర్మ చి
దాకారా! వేంకటేశ్వరా! వేలనతుల్ ||

మ|| నిరతమ్ముగ్ జనకుండు, సద్గురుడు, మన్నింపంగ, నా తల్లి న
న్నరయన్, సర్వశుభాస్పదంబయిన, సర్వైశ్వర్య కైవల్య సు
స్థిర శైలాధిపుడైన శ్రీహరిని, భక్తిం గొల్చి, శ్రీవేంకటే
శ్వర చారిత్ర రహస్యమున్, శుభదమున్ వ్రాయంగ నేఁబూనితిన్||

క|| ఆశీర్వదించి, సప్తగి
రీశా! నా గ్రంథరచనకీగదవె! మనీ
షాశక్తిని, శ్రీకరియే
శ్రీకరుడని మదినెఱుంగ జేయవె ! తండ్రీ! ||

**కలియుగ ప్రత్యక్షదైవమైన శ్రీ వేంకటేశ్వరుని వైభవానికి సంబంధించిన రహస్యాలను తెలుసుకుంటున్నాం. అందులో భాగంగా ఈ సంచికలో మరిన్ని విషయాలు తెలుసుకుందాం.**



శ్రీమహావిష్ణుని పలుకులు విన్న సనకాదులు భూలోకానికి వచ్చారు. ఆ తరవాత కొంతకాలానికి వరాహస్వామి హిరణ్యాక్షుని సంహరించాక, క్రీడాపర్వతాలు భూలోకం చేరుకొన్నాయి. ఆ పర్వతం పై గల పవిత్రమైన గుహలలో చేరి సనకాదులు కఠోర తపస్సు చేసారు. వారికి అపూర్వశక్తులు లభించాయి. వారు తిరిగిన తీర్థాలు నేటికీ వారి పేరు మీదుగా, సనక, సనందన, సనత్కుమార, సనత్సుజాత తీర్థాలుగా ప్రసిద్ధి పొందాయి. ఇప్పటికీ ఆ మహాత్ములు ఆ కొండపై తఱచుగా సాధన చేస్తుంటారు. యోగులు, మహాత్ములు, ఆ కొండపైకి కాలినడకన వెళ్తున్నప్పుడు, అప్పుడప్పుడు వారి దర్శనం అవుతుంటుంది. మా తాతగారు, తండ్రిగారు కూడా సనత్కుమారుని చూడగలిగారు. ఆ కొండపైన వారు దిగంబర బాలురుగా గాని, లేదా అమాయికపు పిల్లలుగా గాని, లేదా నల్లని గోపాలబాలుర రూపంలోగాని కనబడుతుంటారు. ఈ విషయాన్ని లీలాశుకుడు కూడా వివరించాడు. ఇంతకంటె గొప్ప రహస్యమేముంటుంది? కాకపోతే వారు మన ప్రక్కనుండి వెడుతున్నా వారిని మనం గుర్తించలేము. వారిని గుర్తించాలంటే ముందుగా గురుభక్తి కావాలి. కఠోర విశ్వాసం వేంకటాద్రిపై ఉండాలి. కోరికలను అదుపులో పెట్టుకోవాలి. ఆ కొండపై నడుస్తున్నప్పుడు నిరంతరం 'గోవింద' నామస్మరణ చేస్తుండాలి. ఇలా సాధన చేసే భక్తులకు మాత్రమే ఆ యోగుల దర్శనం లభిస్తుంది.

త్రేతాయుగంలో శ్రీమహావిష్ణువు దశరథునికి పుత్రుడిగా జన్మించాడు. సీతతో లక్ష్మణునితో వనవాసం చేస్తుండగా, సీతను రావణుడు అపహరించాడు. అప్పుడు రాముడు, లక్ష్మణునితో కలసి సీతకోసం వెదకుతూ చివరకు సుగ్రీవునితో స్నేహం చేసాడు. వాలిని వధించాడు. సుగ్రీవుని కిష్కింధకు రాజును చేసాడు. సుగ్రీవుడు వానరులను అన్ని దిక్కులకూ సీతాన్వేషణకు పంపగా, హనుమంతుడు, దక్షిణ సముద్రం దాటి, సీతను చూచివచ్చాడు. శ్రీరామచంద్రుడు, వానరులతో కలసి లంకకు ప్రయాణమయ్యాడు. దారిలో వేంకటాద్రి కనపడింది. ఆ పర్వతం క్రింద రాముడు ఆ పూట విడిది

చేద్దామన్నాడు. ఆ కొండలలో ఒక కొండపై ఆంజనేయుని తల్లి అంజనాదేవి తపస్సు చేసుకొంటున్నది. ఆమె పేరుపై ఆ కొండ అంజనాద్రి అని పిలువబడుతోంది. శ్రీరాముడు సాక్షాత్తుగా శ్రీమన్నారాయణుడు అని ఆమెకు తెలుసు. ఆయన వానర సైనికులతో కలసి వేంకటాద్రి ప్రక్క నుండి, దక్షిణ సముద్రం వైపు వెడుతూ, అక్కడ ఆగాడని తెలుసుకొన్న అంజనాదేవి, ఆ క్షణమే కొండ దిగింది. రాముని దర్శనం చేసుకొన్నది. ఆయన పాదాలకు నమస్కరించింది. భక్తితో ఇలా స్తుతించింది:

రామా! శ్రీమన్నారాయణా! రాక్షసవిధ్వంసకా! ధర్మమూర్తీ! ఏకపత్నీవ్రతకీర్తీ! సుగుణాభిరామా! సూర్యవంశసాగరసోమా! ధర్మసంస్థాపన కోసం అనేకావతారాలు ధరిస్తుంటావు. నీ కరుణ ఇంతింతనరానిది. ఒక్క పండు ఇచ్చినంతమాత్రాన జీవులకు ముక్తిఫలం అందించే ప్రభుడవు. జగదీశ్వరా! నా తపస్సు పండి, నేను నీ దర్శనం చేసుకోగలిగాను. నేనీ వేంకటాద్రిపై గల కొండలలో ఒకదానిపై నివసిస్తూ తపస్సు చేసుకొంటున్నాను. నాపై దయ చూపించు. నేనుండే గుహకు వేంచేయి. నా ఆతిథ్యాన్ని స్వీకరించి నాకు శాశ్వత శ్రీకైవల్యాన్ని ప్రసాదించు ప్రభూ! నా పుత్రుడు హనుమంతుడు పరమ భాగ్యవంతుడు. అతడిని అందరూ రామదాసుడు అంటుంటే విని మురిసిపోతున్నాను. నన్ను కూడా నీ పాదదాసురాలిని చేసుకో.

అంజన పలుకులకు రాముడు చిరునవ్వు చిందిస్తూ ఇలా సమాధానమిచ్చాడు — నీ ఆశ్రమానికి రావడానికి నాకేమీ అభ్యంతరం లేదు. కాని నాకు కార్యభారం అధికంగా ఉంది. ఇంతమంది వీరాధివీరులైన వానరులతో కలసి లంకానగరానికి వెళ్ళాలి. దూరప్రయాణం, భారప్రయాణం కనుక ప్రస్తుతానికి రాలేను. తిరుగు పయనంలో నీ ఆతిథ్యం స్వీకరిస్తాను. ఈ విధంగా రాముడు అంజనాదేవి మనస్సు గ్రహించడానికి, ఆమె ఆశ్రమానికి వెళ్ళే ప్రయాణాన్ని ప్రస్తుతానికి వాయిదా వేస్తున్నట్లుగా సమాధానమిచ్చాడు. అప్పుడంజనాదేవి మళ్ళీ ఆయన పాదాలు గట్టిగాపట్టుకొని ఇలా అన్నది — "ప్రభూ! సర్వవ్యాపకుడవైన నీకు కార్యభారం, ప్రయాణభారం ఉంటుందా? నీవు నా ఆశ్రమానికి వస్తానని, అక్కడ నిన్ను దర్శించుకుందామని వేంకటాద్రిపై రహస్యతపస్సు చేసుకొంటున్న మునులు, నా ఆశ్రమ గుహ దగ్గరకు చేరుకున్నారు. వారంతా నీ రాక కోసం తపించిపోతున్నారు. నీవు భక్తజనరక్షకుడవు. భక్త పక్షపాతివి. మాకు దర్శనం ఇయ్యవా?"

అంజనాదేవి ఇలా రాముని ప్రార్థిస్తుండగా ఆంజనేయుడు కూడా అక్కడికి వచ్చాడు. పరమమాత్మభక్తి పరాయణుడైన హనుమంతుడు రాముని పాదాలు పట్టుకొని భక్తితో ఇలా ప్రార్థించాడు — దేవా! సర్వలోక సుహృద్భావా! మా అమ్మ నీ దర్శనం కోసం, నీకు ఆతిథ్యం ఇవ్వడం కోసమే ఈ కొండపై నివసిస్తూ, తపిస్తున్నది. నాకు చనుబాలతోటే రామభక్తి నేర్పిన ఉత్తమురాలు నా తల్లి. నన్ను , నా తల్లిని అనుగ్రహించి ఆమె ఆశ్రమానికి వచ్చి ఆమె ఆతిథ్యాన్ని స్వీకరించమని భక్తితో ప్రార్థిస్తున్నాను. వానరులు కూడా ప్రయాణం చేసి అలసిపోయారు. వీరందరూ అంజనాద్రికి చేరితే మంచిది. అంజనాశ్రమం సిద్ధస్థలం. మా తల్లి మహిమవల్ల అక్కడ దివ్యవృక్షాలు బాగా పెరిగి ఉన్నాయి. ఆ వృక్షాల పుష్పాలు నిరంతరం తేనెను స్రవింపజేస్తూంటాయి. ఆ తేనె త్రాగితే మహోత్సాహం కలుగుతుంది.

...ఇంకా ఉంది

******

# ప్రణవ పద్మాకరం
శ్రీ ప్రణవపీఠం వారి మాసపత్రిక

## ఋషి చరిత్ర

### శ్రీ సుశ్రుత మహర్షి

శ్రీ మహాగణాధిపతయేనమః

శ్రీ గురుభ్యో నమః



కొన్ని విషయాలు తెలుసుకొనే వరకు వాటి ప్రాముఖ్యము మనకు తెలియదు, ఆ పరమేశ్వరుడు సృష్టించిన ఈ ప్రపంచం ఒక అద్భుతం, చూడగలగాలే కానీ ప్రతి ఒక్కటీ ఒక అందమైన అనుభూతిని కలిగిస్తుంది.

అలాంటి ఒక అనుభవమే శ్రీ సుశ్రుత మహర్షి, ఈయన ఆయుర్వేదానికి చెందిన ఒక శస్త్ర చికిత్సకుడు, అధ్యాపకుడు. క్రీ.పూ. 6వ శతాబ్దానికి చెందిన ఈయన వారణాసిలో జన్మించాడు. ఇప్పుడు ఉన్న ఆధునిక పరికరాలతో శస్త్ర చికిత్స చాలా క్లిష్టం, కానీ ఏ సాంకేతికత లేని రోజులలో కూడా అత్యంత క్లిష్టమైన శస్త్ర చికిత్సలను చాల నైపుణ్యంతో చేసిన ఘనత శుశ్రుత మహర్షికే చెందుతుంది.

ఈయన వైద్య శాస్త్రంలోని విభాగాలన్నిటిలో ప్రావీణ్యము సాధించడమే కాక ఆ రోజులలోనే సిజేరియన్ ఆపరేషన్లను కూడా ఆవిష్కరించిన ఘనత శుశ్రుత మహర్షిది, అలాగే ప్రపంచానికి ప్లాస్టిక్ సర్జరీని పరిచయం చేసింది కూడా ఈయనే. అందుకే ఈయనను "ప్రపంచంలో మొట్టమొదటి శస్త్రవైద్యశిఖామణి" గా పేర్కొనడం జరిగింది.

కొన్ని వేల సంవత్సరాల క్రితమే శస్త్రచికిత్స కోసం 120 రకాల వైద్య పరికరాలను ఉపయోగించేవాడట! తెగిన శరీర భాగాలను అతికించటం, శరీరంలో పేరుకున్న లేదా చొరబడిన విదేశీ పదార్థాలను (ఫారిన్ ఆంటీబాడీస్) కనుగొని తొలగించటం, పుచ్చిన, దెబ్బతిన్న దంతాలను తొలగించడం, వరిబీజం (బుడ్డ) రోగికి హాని కలుగకుండా శస్త్రచికిత్స చేసి వేరుచేయడం ఇవన్నీ ప్రపంచ వైద్యులకు పరిచయం చేసింది శ్రీ సుశ్రుత మహర్షి గారు!

తన జీవిత కాలంలో ఎందరికో ఆరోగ్యాన్ని ప్రసాదించి, వందలాదిమంది శిష్యులను తయారుచేసారు. అంతే కాక శస్త్రచికిత్సకు సంబంధించిన సమగ్ర సమాచారం " సుశ్రుత సంహిత" అనే గొప్ప గ్రంథం ద్వారా యావత్ ప్రపంచానికి పరిచేయం చేసిన గొప్ప మహర్షి.

ఈ " సుశ్రుత సంహిత" లో 184 అధ్యాయాలు ఉన్నాయి. దీనిలో మనిషి సాధారణంగా గురికాబడే వ్యాధులు 1120 గా నిరూపింపబడింది. అలాగే మానవ శరీరం నిర్మాణం తీరుతెన్నుల గురించి, ప్రతి అవయవ నిర్మాణం గురించి విపులంగా చెప్పబడింది. 700 పై బడిన ఔషధీ మొక్కల లక్షణ విశేషాలు - ఏ వ్యాధికి ఏ మొక్క ఎలా ఔషధంగా ఉపయోగపడి రోగాన్ని ఎలా తగ్గిస్తుందో ఉదాహరణపూర్వకంగా నిరూపించబడింది. 64 రకాల ఖనిజాల నుండి మందులను ఎలా తయారుచేసుకోవాలో ఇవ్వబడినాయి. అంతేకాక జంతు సంబంధమైన అవయవాల నుండి 57 ఔషధాలను తయారుచేసే వైద్య విజ్ఞానం ఉంది. ఇంతటి గొప్ప విషయం మన భారతదేశం లో ప్రాముఖ్యం పొందాలని ఆశిద్దాం, అలాగే ఆయన సాధించిన విషయాలు భవిష్యత్తులో రాబోయే శస్త్ర చికిత్సకారులకు ఆదర్శం.

******

# ఐశ్వర్య యోగం

శ్రీ మహాగణాధిపతయేనమః శ్రీ మాత్రేనమః శ్రీ గురుభ్యోనమః

ఆరోగ్యమే ఐశ్వర్యంగా భావించి జీవించే భక్తజనావళికి ఈ ఐశ్వర్యయోగం అమృతకలశం. సద్భక్తుల హృదయాలలో చేరిన మాలిన్యాన్ని తొలగించడానికి, సకల ఆరోగ్యసంపదలు అందరికి అందజేయడానికి, శ్రీ లలితాసహస్రనామాలనే కుసుమాలను ఐశ్వర్యయోగంగా మలచారు సద్గురువులు బ్రహ్మశ్రీ వద్దిపర్తి పద్మాకర్ గారు. లలితాసహస్రనామాలు అందరికీ సుపరిచితమే కానీ, ఏ నామాన్ని పారాయణం చేస్తే, తమ జీవనగమనాన్ని మార్చుకోవచ్చో తెలియజేసేదే ఐశ్వర్యయోగం. సమస్త జనులకు ఇది దివ్య ఔషధము.

## 303. హృద్యా (ఓం ఐం హ్రీం శ్రీం హృద్యాయై నమః)

హృద్యా అనే ఆకారాంత స్త్రీలింగ శబ్దానికి ఋద్ధి అనబడే ఓషధి అని ఒక అర్థం. ఈ ఓషధిని సేవిస్తే జీవితంలో అభివృద్ధి కలుగుతుంది. అమ్మవారు ఈ ఓషధీస్వరూపిణి. శ్రీసూక్తంలో 'హస్త్యశ్వాజావిగోరథమ్' అని ఉంది. మేకలు కూడా సంపదలే. హృద్య అంటే ఆడుమేక అని కూడా ఒక అర్థం. అమ్మవారు ఒకసారి ఆడుమేక రూపం ధరించి ఓషధులతో నిండిన పాలు ఋషులకు ఇచ్చి వారిని ఆరోగ్యవంతులను చేసింది. అందువల్ల అమ్మను హృద్యాయైనమః అని మునులు స్తుతించారు. హృద్య అనగా హృదయంలో పుట్టునది. హృదయంలో ప్రవేశించి ఆనందం కలిగించేది అని కూడా అర్థం. హృదయం అంటే బ్రహ్మస్థానం. అనగా అమ్మ బ్రహ్మస్వరూపిణి అని కూడా అర్థం. హృద్య అంటే అందమైనది అని కూడా అర్థం.

**మంత్రప్రయోగం-ఫలితము :** మనస్సు చంచలమైనది. నిలుకడలేని మనస్సు వల్లనే చాలామంది జీవితంలో అనుకొన్నది సాధించలేకపోతున్నారు. అటువంటి వారు శుక్ల, కృష్ణ పక్షాలలోని ఏ అష్టమి నుండి అయినా ప్రారంభించి ఈ మంత్రాన్ని 72 దినములు జపం చేసుకోవాలి. జపకాలంలో అమ్మవారిని పసుపుపచ్చని పూలతో పూజించాలి. తీపిపదార్థం ఏదయినా అమ్మకు నివేదించాలి. జపసంఖ్య 216. అంతకంటె ఎక్కువ చేస్తే ఫలం కూడా ఎక్కువ అవుతుంది. ఏకాగ్రతను అందించే ఈ మంత్రజపం గొప్పగొప్ప విద్యలను సాధించడానికి, ఇతరులను ఆకర్షించడానికి ఉపయోగపడుతుంది.





## 304. హేయోపాదేయవర్జితా (ఓం ఐం హ్రీం శ్రీం హేయోపాదేయ వర్జితాయై నమః)

'అహేయమనుపాదేయమ్' అని వేదం చెపుతున్నది. హేయము అనగా విడిచిపెట్టడానికి తగినది. మన దగ్గఱ ఉండకూడని దానిని హేయము అంటారు. ఉపాదేయము అనగా పొందడానికి తగినది. ఇది ఉండకూడదు, ఇది ఉండాలి అనే భావంలో హేయ+ఉపాదేయములు అంటారు. ఈ రెండూ లేనిది అమ్మ. అనగా అమ్మవారికి ఇష్టమైనదీ ఉండదు, ఇష్టం కానిదీ ఉండదు. నింద్యమైనదీ ఉండదు, అనింద్యమైనదీ ఉండదు. రాగద్వేషాలు రెండూ లేనిది. సామాన్యులు కొన్నింటిని దూరం పెడతారు. అటువంటివి అమ్మకు ఉండవు. మనకు వేఱుగా ఏదైనా ఉన్నపుడే విడిచిపెట్టడం, స్వీకరించడం చేస్తాము. కాని అన్ని పదార్థాలూ అమ్మవారే అయినపుడు విడచుట, గ్రహించుట ఉండవు కనుక అమ్మను 'హేయోపాదేయవర్జితా'అన్నారు.

మంత్రప్రయోగం-ఫలితము :కొంతమందికి అకారణంగానే ఇతరులపై ద్వేషం కలుగుతుంది. కొందరిపై ప్రేమ కలుగుతుంది. ద్వేషం వల్ల శత్రువులు పెరుగుతారు. ప్రేమ వల్ల లేనిపోని సమస్యలు ఏర్పడతాయి. రాగద్వేషాల వల్ల ఏర్పడే సమస్యలు చివరకు ఆత్మహత్యకు కూడా కారణమవ్వడం లోకంలో తఱచుగా చూస్తుంటాము. ఇటువంటి సమస్యల నుండి బయటపడడానికి ఈ మంత్రాన్ని 36 దినాలు దినమునకు 216 సార్లు జపం చేసుకోవాలి. ఏలకులు, పచ్చకర్పూరం కలిపిన నీటిని అమ్మవారికి నివేదించి, జపానంతరం కొద్దిగా తీర్థంగా ఆ నీటిని త్రాగితే భయంకరములైన శత్రుమిత్ర పీడ తొలగుతుంది. శత్రుపీడ కంటె మిత్రులుగా ఉన్న వారి నుండి వచ్చే కష్టాలు కలియుగంలో ఎక్కువగా ఉంటాయి. ఆ బాధానివారణకు ఈ మంత్ర జపం అత్యుత్తమమైనది.

... మరొక నామార్థ వివరణ వచ్చే సంచికలో

## పురాణం లో మహిళలు

### మహా పతివ్రతాశిరోమణి సుమతి

పూర్వకాలంలో ప్రతిష్ఠానపురం అనే నగరంలో కౌశికుడు అనే బ్రాహ్మణుడు ఉండేవాడు. అతడు మహా కోపిష్ఠి మరియు వ్యభిచారి. అతని భార్య సుమతి ఉత్తమ ఇల్లాలు, పరమశాంతమూర్తి. అయినా భర్త తన కోపస్వభావంతో నిత్యం వేధిస్తున్నా ఏమాత్రం బాధపడకుండా పతినే దైవంగా భావించి అతని సేవకే తన జీవితాన్ని అంకితం చేసిన పతివ్రతామూర్తి సుమతి. కొంతకాలం పిదప కౌశికుని కి కుష్టు వ్యాధి వచ్చింది. అతడు నడవలేని స్థితికి వచ్చాడు. ఆ పరిస్థితులలో కూడా ఒక వేశ్యను చూసి అతడు మోహించి ఆమె వద్దకు తీసుకుని వెళ్ళమని భార్యను వేధించసాగాడు. ఎన్నిమార్లు సముదాయించి చెప్పినా వినని భర్త మూర్ఖత్వానికి తలవంచి, గత్యంతరం లేక భర్తను ఒక డోలి లో వేశ్య దగ్గరకు తీసుకువెళ్లసాగింది. సరిగ్గా ఆ సమయంలోనే మాండవ్య మహర్షి అడవిలో తపస్సు చేస్తుండగా పొరపాటున కౌశికుని కాలు మాండవ్య మహర్షి కి తగిలింది. దాంతో కోపించిన మాండవ్యమహర్షి తనకు కాలును తగిలించిన కౌశికుడు సూర్యోదయానికి ముందుగానే మరణిస్తాడని శపించాడు. మహర్షుల శాపమునకు తిరుగులేదు కదా! తెలియక చేసిన పొరపాటు వల్ల భర్త ప్రాణాలకు ముప్పు కలిగిందని గ్రహించినటువంటి సుమతి తన పతిని ఏవిధంగానైనా బ్రతికించుకోవాలని ఆలోచిస్తూ మరుసటి రోజు సూర్యోదయం కాకుండా ఉండునట్లుగా సూర్యునికి ప్రతి శాపం ఇచ్చింది. భర్తే దైవంగా భావించే

పతివ్రతాశిరోమణుల ధర్మం, సత్యంతో కూడినటువంటి పలుకులకు పంచభూతాలు కూడా తలవంచుతాయి. ఆ మరుసటిరోజున సూర్యోదయం కాలేదు. ముల్లోకాలు సూర్యోదయం కోసం ఎదురు చూడసాగాయి. దేవతలు, మహర్షులు బ్రహ్మ దగ్గరికి వెళ్లి జరిగిందంతా చెప్పి, సూర్యోదయం జరిగేట్లు చూడమని ప్రార్థించారు. ఒక పతివ్రతాసంకల్పాన్ని మరో పతివ్రత మాత్రమే మార్చగలదు. అందుకని బ్రహ్మ అనసూయ వద్దకు వెళ్లి శాపం ఉపసంహరించుకునేటట్లుగా చేయమని సూచించాడు. బ్రహ్మ ఆదేశానుసారం వెంటనే అనసూయ, సుమతి దగ్గరికి వెళ్లి ఆమెను ఊరడించి, ఆమె భర్తని బ్రతికించే బాధ్యత తాను వహిస్తానని చెప్పి, శాపాన్ని ఉపసంహరించుకోవాలని కోరింది. అనసూయ మాటలు విన్న సుమతి సూర్యునికి ఇచ్చిన శాపాన్ని ఉపసంహరించుకుంది. అంతే తూర్పు దిక్కు నుండి సూర్యభగవానుడు ఉదయించాడు. ఆ దృశ్యాన్ని చూచి అందరూ ఆనందపారవశ్యం చెందారు. సూర్యోదయం కాగానే మాండవ్యుని శాపఫలితంగా కౌశికుడు మరణించాడు. అప్పుడు అనసూయ తాను సుమతికి ఇచ్చిన మాట ప్రకారం తన పాతివ్రత్య మహిమతో కౌశికుని తిరిగి బ్రతికించింది.

ఆ క్షణంలోనే బ్రహ్మ ప్రత్యక్షమై కౌశికునికి కుష్టు రోగనివారణ చేసి, అతన్ని అందమైన యువకుడిగా మార్చి, సుమతి పతివ్రతామహిమను మెచ్చుకున్నాడు. ఆమె పేరు శాశ్వతంగా నిలిచి ఉంటుందని దీవించి, అదృశ్యమయ్యాడు. పతివ్రతాశిరోమణి ఐన సుమతి తన భర్త ప్రాణాలను కాపాడుకోవడం కోసం సూర్యోదయాన్ని సైతం అడ్డుకున్నటువంటి కథ ఇది.



******

పూజ్య గురుదేవులు అందించిన 'మా'నవ కథ , శ్రీ వేంకటేశ్వర విలాసం , ఐశ్వర్య యోగం , శ్రీ మద్దేవీభాగవతం వంటి దివ్య గ్రంథముల కొఱకు , పూజ్య గురుదేవుల ప్రవచనముల కొఱకు, అంతర్జాతీయ అంతర్జాల పోటీల కొఱకు వెబ్సైటును సందర్శించండి.

https://srivaddipartipadmakar.org/

## స్తోత్రమాలిక



### శ్రీ ఆంజనేయ (హనుమద్) బడబానల స్తోత్రము

**ఫలశ్రుతి:** పరమపవిత్రమైన జగత్ప్రసిద్ధికెక్కిన శ్రీ హనుమద్ బడబానల స్తోత్రమును విభీషణుడు తన జీవితంలో ఎదురయ్యే ఆటంకములన్నింటినీ తొలగించుకోవడానికి స్వయంగా రచించాడు. ఈ స్తోత్రాన్ని నిరంతరం వినేటటువంటి వారు, ప్రతిదినమూ ఉదయం పూట గాని, సాయంసంధ్యా సమయంలో గాని భక్తి, శ్రద్ధలతో చదివేవారు, విన్నవారు భయంకరమైన కష్టాలలో నుండి బయటపడతారు. అగ్నిజ్వాలల వంటి కష్టాలు కూడా చల్లారి, పటాపంచలైపోతాయి. జీవితంలో సకల శుభాలు లభించాలంటే, అనుకున్న పని తత్ క్షణం అవ్వాలంటే ఈ స్తోత్రాన్ని చేసి తీరాలి, అని శ్రీరామచంద్రుడంతటివాడు అన్నాడు. శ్రీ హనుమత్ కటాక్షాన్ని సంపూర్ణంగా అందించే స్తోత్రమిది. కార్యసిద్ధికి, బ్రహ్మానందానికి, భయంకర సంసార దుఃఖాలు తొలగడానికి ఈ స్తోత్రానికి మించిన స్తోత్రం లేదని రామచంద్రుడు, విభీషణుడు ఈ స్తోత్రం రచించిన తరువాత పలికాడు.

ఓం అస్యశ్రీ హనుమత్ బడబానలస్తోత్ర మహామంత్రస్య | భగవాన్ శ్రీరామచంద్ర ఋషిః | శ్రీ బడబానల హనుమాన్ దేవతా | మమ సర్వరోగ ప్రశమనార్థం | శ్రీ సీతారామచంద్ర ప్రీత్యర్థం | హనుమత్ బడబానల స్తోత్ర జపం కరిష్యే |

ఓం హ్రాం హ్రీం ఓం నమో భగవతే శ్రీహనుమతే ప్రకట ప్రశస్థక్రమ సకల దిఙ్మండల యశోవితాన కబళీకృత జగత్రితయ వజ్రదేహ రుద్రావతార లంకాపురీ దహన సీతాశ్వాసన వాయుపుత్ర శ్రీరామామలమంత్రోపాసక ఉదధిబంధన దశశిరకృతాంతక సీతాశ్వాసన వాయుపుత్ర అంజనీగర్భ సంభూత శ్రీరామ లక్ష్మణానందకర కపిసైన్యప్రాకార సుగ్రీవ సహాయకర పర్వతోత్పాటన కుమార బ్రహ్మచారీ గంభీరనాద సర్వపాపగ్రహనాశక సర్వజ్వరోచ్చాటన ఢాకినీ విధ్వంసన ఓం హ్రాం హ్రీం ఓం నమో భగవతే మహావీర వరాయ సర్వదుఃఖనివారణాయ గ్రహమండల సర్వభూతమండల సర్వపిశాచ మండలోచ్చాటన భూతజ్వర ఏకాహిక జ్వర ద్వ్యాహిక జ్వర త్ర్యాహిక జ్వర చాతుర్థిక జ్వర సంతాప జ్వర విషమ జ్వర తాప జ్వర మహేశ్వర వైష్ణవ జ్వరాన్ ఛింది ఛింది యక్ష బ్రహ్మరాక్షస భూత ప్రేత పిశాచాన్ ఉచ్చాటయ ఉచ్చాటయ ఓం హ్రాం హ్రీం ఓం నమో భగవతే శ్రీ మహాహనుమతే ఓం హ్రాం హ్రీం హ్రూం హ్రైం హ్రౌం హ్రః ఆం హ్రాం హ్రీం హ్రూం హ్రైం హ్రౌం హ్రః ఐం సౌం ఏహి ఏహి ఓం హ్రాం ఓం హ్రీం ఓం హ్రూం ఓం హ్రైం ఓం హ్రౌం ఓం హ్రః ఓం నమో భగవతే శ్రీమహాహనుమతే శ్రవణ చక్షుర్భూతానాం శాకినీ ఢాకినీనాం విషమ దుష్టానాం సర్వ విషం హరహర ఆకాశభవనం భేదయ భేదయ భేదయ మారయ మారయ మారయ వశమానయ ఆనయ ఆనయ శోషయ శోషయ శోషయ మోహయ మోహయ మోహయ జ్వాలయ జ్వాలయ ప్రహారయ ప్రహారయ సకలమాయాం భేదయ భేదయ భేదయ ఓం హ్రాం హ్రీం ఓం నమో భగవతే మహా హనుమతే సర్వగ్రహోచ్చాటన పరబలం క్షోభయ క్షోభయ సకలబంధనమోక్షం కురుకురు శిరశూల గుల్మశూల సర్వశూలాన్ నిర్మూలయ నిర్మూలయ నాగపాశ అనంత వాసుకీ తక్షక కర్కోటక కాళియానాం యక్షకుల కులగత క్షితిగతిరాత్రించరాదీనాం విషారిష్టాన్ నిర్విషం కురు కురు స్వాహా రాజభయ చోరభయ పరమంత్ర పరయంత్ర పరవిద్య పరప్రయోగాదీన్ ఛేదయ ఛేదయ స్వమంత్ర స్వయంత్ర స్వవిద్యాన్ ప్రకటయ ప్రకటయ సర్వారిష్టాన్ నాశయ నాశయ సర్వశత్రూన్ నాశయ నాశయ అసాధ్యం సాధయ సాధయ హుం ఫట్ స్వాహా ||

******

ప్రణవ పద్మాకరం
శ్రీ ప్రణవపీఠం వారి మాసపత్రిక

# రథ సప్తమి



**"ఆరోగ్యం భాస్కరాదిచ్ఛేత్"** ఆరోగ్యమును సూర్య భగవానుడి ద్వారా పొందండి అని అర్థం.

**సూర్య భగవానుడి యొక్క మొదటి అవతారం :**

ఆరోగ్యప్రదాత అయిన సూర్యుడు విష్ణు స్వరూపుడు. తనంతట తాను పుట్టిన వాడు. ఆయన మొట్టమొదట అవతరించినపుడు వివస్వాన్ అని పేరు.

**సూర్య భగవానుడి రెండవ అవతారం :**

కశ్యప ప్రజాపతి దక్షుని పదిముగ్గురు కూతుర్లను వివాహం చేసుకున్నాడు. మొదటి భార్య అదితి, వీరి సంతానమైన ఇంద్రాది దేవతలకు ఆదిత్యులు అని పేరు. కశ్యపుడికి దితికి పుట్టిన వారు దైత్యులు, వీరంతా రాక్షసులు వీరు దేవతలను, ఋషులను నాశనం చేయటం మొదలు పెట్టారు. యజ్ఞాలు పాడుచేశారు, ధర్మాన్ని విధ్వంసము చేసారు. మంచి ఉన్నచోట ప్రత్యక్షమయ్యి అధర్మాన్ని పెంచారు. మల, మూత్ర విసర్జన ద్వారా యజ్ఞ యాగాలను నాశనం చేసేవారు. వీరిని ఎలా నాశనం చేయాలో తెలియక దేవతలు తల్లితండ్రుల దగ్గరకి వచ్చి మొర పెట్టుకున్నారు, మీ పుత్రులైనటువంటి దితి సంతానం సమస్త లోకాలను నాశనం చేస్తున్నారు, వీరి నుండి మమ్మల్ని రక్షించమని ఇంద్రాదులు వేడుకున్నారు. అప్పుడు అదితి కశ్యపుడితో కలిసి సూర్య భగవానుడిని ప్రార్ధించింది. అఖండ తేజోవంతుడైన సూర్యుడు, ప్రార్ధనకు సంతోషించాడు. సూర్యుడు మండలరూపం లో ఉంటాడు, కాంతితో ఉంటాడు, అందునా విగ్రహంతో ఒక ఆకారంగా ప్రత్యక్షమయ్యి వరం కోరుకోమన్నాడు. అప్పుడు వారు మాకు పుత్రుడివై పుట్టి లోకములను నాశనం చేస్తున్న దైత్యులను సంహరించు అన్నారు. యజ్ఞములను రక్షించు, ఇంద్రాది దేవతలను రక్షించు, ధర్మసంస్థాపన

చేయి అనగా సూర్యుడు "తథాస్తు" అన్నాడు. కశ్యపప్రజాపతి ద్వారా అదితి గర్భంలో ప్రవేశించాడు. వేయి సంవత్సరములు అదితి గర్భం ధరించింది. ఈ వెయ్యి సంవత్సరాలు అదితి అన్నం తినలేదు, మంచినీరు తాగలేదు. దానితో కశ్యపుడికి కోపం వచ్చి బిడ్డని చంపేస్తావా , మృత పిండం పుడుతుందేమో అన్నాడు. అదితి మార్తో భవ అన్నది (అంటె బెంగపెట్టుకోకు అని), కడుపులో ఉన్నది సామాన్యుడు కాదు మహాత్ముడు పుడతాడు అన్నది. అలా అనగానే టక్కున పిల్లవాడు పుట్టుకొచ్చాడు. మార్తో భవ అనడం వలన మార్తా, అండం కనుక మార్తాండుడు అని పేరు వచ్చింది. మృత అండం పుడుతుందేమో అని కశ్యపుడు అనడం వల్ల కూడా మార్తాండుడు అయ్యాడు. అలా సూర్యుడు పుట్టిన తిథి మాఘ మాసం శుక్ల పక్ష సప్తమి, ఈ రోజునే సూర్య జయంతిగా, రథ సప్తమిగా పిలుస్తున్నాం. ఈ కథని ఈ నాడు వింటే వేయి యజ్ఞములు చేసిన ఫలితం పొందుతారని పురాణం చెపుతున్నది. ఈ కథని విన్నాక గురువుకు యథాశక్తిగా దక్షిణ ఇచ్చినవాడు కోటి గోవులను బంగారంతో కలిపి కురుక్షేత్రం లో ఇచ్చిన దాన ఫలితం పొందుతాడు. ఈ విధంగా సూర్య భగవానుడు అదితికి పుట్టి ఆదిత్యుడని పిలువబడ్డాడు. కశ్యపుడి కొడుకు కనుక కాశ్యపేయుడు, కశ్యపాత్మజుడు అయ్యాడు. ఏడు గుఱ్ఱముల రథమెక్కి ఆకాశమునకు వెళ్లిపోయి సూర్య బింబంలో లీనమయ్యాడు. ఏడు గుఱ్ఱముల రథమెక్కి ఆ స్వామి వారు సూర్యమండలానికి వెళ్ళారు కనుక దీనిని రథసప్తమి అన్నారు. సూర్యభగవానుడి యొక్క రథానికి ఏడు గుఱ్ఱాలు ఉంటాయి అందుకే "సప్తాశ్వరథం ఆరూఢమ్ ప్రచండం కశ్యపాత్మజమ్ | శ్వేతపద్మధరమ్ దేవం తం సూర్యం ప్రణమామ్యహం ||" అన్నారు ఋషులు. సూర్య భగవానుడు పుట్టీపుట్టగానే తల్లిదండ్రులను అనుగ్రహించి దీవించి మిట్ట మధ్యాహ్నం సమయమునకల్లా ఏడు గుఱ్ఱముల రథమెక్కి సూర్య మండలం చేరుకున్నాడు. పుట్టీపుట్టగానే ఆయన చేతిలో తెల్లని తామర పువ్వు ఉండేది. తెల్ల తామరాన్ని శ్వేతపద్మం అంటారు, అందుకే సూర్యుణ్ణి శ్వేతపద్మధరుడు అంటారు.

అనూరుడనే ఆయన్ని రథసారథిగా చేసుకొని చేతిలో కోదండం ధరించి ఆ కోదండానికి బ్రహ్మాస్త్రం, ఆదిత్యాస్త్రం, ఆగ్నేయాస్త్రం వంటి అస్త్రాలు సంధించి, రాక్షసులను విధ్వంసం చేసాడు. మిగిలిన రాక్షసులు సూర్యుణ్ణి శరణు కోరారు. శరణు కోరిన వారిని రక్షించి, పాతాళానికి పంపి వాళ్ళ రాజ్యపాలన వారిని చేసుకోమన్నాడు.

ఈ రోజున దుష్ట శిక్షణ అయ్యాక బృహస్పతి వచ్చి మేము నిరంతరం నిన్ను పూజించటానికి సులభోపాయం చెప్పమన్నాడు, నిన్ను పూజించిన వారికీ ఆరోగ్యం అందించు అన్నాడు. మేము అంటే దేవతలు కనుక నీవున్న చోటికే వచ్చి నిన్ను పూజించగల్గుతున్నాం., భూలోకం వారు నిన్ను పూజించటానికి మార్గం చెప్పు అన్నాడు. అప్పుడు సూర్య భగవానుడు ఇలా అన్నాడు రథ సప్తమి నా కశ్యప అవతారానికి సంబంధించిన తిథి ఈ రోజు నేను యెర్రని కిరణములతో ఉదయించటానికి ముందే స్నానం చేయాలి, స్నానం చేసేటప్పుడు పాత పాత్రలతో చేయకూడదు కొత్తవి వాడాలి. రథ సప్తమి నాడు ఇత్తడి పాత్ర లో నీరు పట్టుకుని స్నానం చేయటం మంచిది.శక్తి ఉన్నవాడు కొత్తపాత్ర కొనుక్కొని వాడటం మంచిది అందునా ఇత్తడిది అయితే మంచిది. చిటికెడు పసుపు కొంచెం కుంకుమ నీళ్లలో కలిపి అవకాశం ఉంటే ఆవు పేడ కూడా గోరంత వేసి కలిపిన నీళ్లతో స్నానం చేస్తే కొత్త పాత్రలో గంగా జలం తీసుకుని వచ్చి స్నానం చేసిన ఫలితం వస్తుంది.స్నానం అనంతరం కొత్త బట్టలు కట్టుకోవాలి లేదా ఉతికిన బట్టలు కట్టుకోవాలి, కుంకుమ ధరించాలి.ఎర్రగా ఉదయిస్తున్న సూర్యభగవానుడికి ఎదురుగా నిలబడాలి, చేతులతో నీళ్లు తీసుకోని అర్ఘ్యం ఇవ్వాలి. సంధ్యావందనం ఉన్నవాళ్లు మంత్రం తో అర్ఘ్యం ఇవ్వాలి. లేని వాళ్ళు "ఓం సూర్యాయనమః, ఓం ఖగాయనమః, ఓం హంసాయనమః" ఈ నామాలతో అర్ఘ్యం ఇవ్వాలి. అర్ఘ్యం తులసి చెట్టు పైన ఇస్తే మంచిది, మూడు నామాలను జపిస్తూ తూర్పు వైపు సూర్యుడికి ఎదురుగా నిలబడి రెండుచేతులతో నీళ్లు ఇస్తే అటువంటి వాడికి సూర్యుడి అనుగ్రహం లభించి, బలవంతుడు, ఆరోగ్యవంతుడు అవుతాడు. తమ వీలుని బట్టి ఆదిత్య

హృదయమ్ కానీ, ఆదిత్య స్తవము కానీ, సూర్య అష్టోత్తర నామం కానీ చదవాలి. మందారములు, గన్నేరు, మల్లె కలిపిన నీళ్లతో అర్ఘ్యం ఇచ్చిన వాడికి కుటుంబ వృద్ధి, ధన, ధాన్య వృద్ధి అవుతుంది. 7 లేదా 4 చిక్కుడు కాయలతో రథం తయారుచేయాలి, దీనికి చిక్కుడు రథం అని పేరు. దాని మీద చిక్కుడు ఆకులు పరిచి ఇంట్లో ఒక చోట పెట్టండి. ఆవుపేడతో చేసిన పిడకలతో ఇత్తడి గిన్నె పెట్టి, ఇత్తడి లేకపోతే కంచు లేదా మట్టి పాత్రలు కూడా పనికి వస్తాయి. దాంట్లో ఆవు పాలతో పాయసం చేయాలి. అవుపిడకల మంటతో మాత్రమే పాయసం వండాలి. బెల్లం, బియ్యం మాత్రమే వాడాలి. గరిటలు వాడకుండా చెఱకుతో కలిపితే ఎక్కువ ఫలితం వస్తుంది. చెరుకు ముక్క లేకపోతే ఇత్తడి గరిటలు వాడాలి. మెత్తగా అయ్యేవరకు వండాలి. దక్షయజ్ఞం లో సతీదేవి ఆత్మాహుతి అనంతరం, వీరభద్రుడు దక్షుడి పక్కన ఉన్నవారి, సూర్యుడి పళ్ళు విఱగ్గొట్టాడు. ఆ తర్వాత సూర్యుడికి యజమాని దంతాలతో ఆహారం తీసుకోమని వరమిచ్చి, ఆ దంతాలతో తాత్కాలికంగా భోజనం చెయ్యమని శివుడు అన్నాడు. అప్పుడు సూర్యభగవానుడు దక్షుడు పిలిచిన యాగానికి మొగమాటానికి వెళ్ళానని, తన దంతములు తిరిగి వచ్చేలా చెయ్యమని శివుని ప్రార్థించాడు. అప్పుడు శివుడు రథసప్తమినాడు చిక్కుడు కాయలతో చేసిన రథం, దానిపైన ఆకులు పరిచి, పైన అవుపిడకలతో వండిన పాయసాన్నం భక్తులు సమర్పిస్తే, ఆ ఆహారం నీకు జీర్ణమౌతుంది. ఆ పాయసం తిన్నప్పటి నుండి మళ్ళీ రథసప్తమి వరకు దంతాలు గట్టిగా ఉంటాయి అని వరమిచ్చాడు. ఈ రోజు జిల్లేడాకులు, రేగుపళ్లు నెత్తిన పెట్టుకొని స్నానం చేస్తే సూర్యుడు ఆరోగ్యం ఇస్తాడు. కుష్టురోగం వంటివి పోతాయి. ఈరోజు ముత్తైదువలకు పసుపుకుంకుమలు, వస్త్రాలు ఇస్తే వారు ముత్తైదువల్లా ఉంటారు.

******

## సరస్వతీ పంచమి

యా కుందేందుతుషారహారధవళా యా శుభ్రవస్త్రాన్వితా
యా వీణావరదండమండితకరా యా శ్వేతపద్మాసనా |
యా బ్రహ్మాచ్యుతశంకరప్రభృతిభిర్దేవైః సదా పూజితా
సా మాం పాతు సరస్వతీ భగవతీ నిశ్శేషజాడ్యాపహా ||



సరస్వతీ మాతకు భక్తి శ్రద్ధలతో నమస్కారం చేసుకుందాము. మాఘశుక్లపంచమి తిథిని సరస్వతీ పంచమి అంటారు. వసంత పంచమి అని కూడా కొందరు అంటున్నారు కానీ దీని గురించి పురాణాల్లో లేదు కానీ సరస్వతీపంచమి అని దీనిని అంటారు. ఒకప్పుడు ఈ చరాచర జగత్తు ఆవిర్భావ కాలంలో మానవులకు మాటల్లేవు. అప్పుడు అన్నీ సైగల తోటే కార్యక్రమాలన్నీ నడిచేవి. అప్పుడు దేవతలందరూ కలిసి ఆలోచించి, మనం ఒకరితో ఒకరు సంభాషించుకోవడానికి ఒక భాష కావాలి అని అనుకున్నారు. ఆ భాష కోసం భక్తి శ్రద్ధలతో అమ్మని ప్రార్థించారు. అందుకే వేదాలలో

ఓం దేవీం వాచ మజనయంత దేవా స్తాం విశ్వరూపాః పశవో వదంతి !!

సానో మంద్రేష మూర్జందుహానా ధేనుర్వాగ స్మా నుపసుష్టుతైతుమ్ !!

అని ఒక మంత్రం ఉన్నది. దేవతలందరూ కలిసి వాగ్దేవిని సృష్టించారు. ఈ వాగ్దేవి ప్రారంభకాలంలో చాలా కాంతివంతమైన శరీరంతో ఉండేది. మహాకాంతి అది. కాకపోతే ఆ రూపం సరిగ్గా ఎవరికీ కనబడేది కాదు. అప్పుడు దేవతలు వాగ్దేవీ! నీవు మా నాలుకల మీద ఉండి, మాకు సంభాషణను ప్రసాదించు. భాషను ప్రసాదించు అంటే ప్రసాదించింది. దేవతలకు భాష వచ్చింది కానీ, మానవులకు మాత్రం ఇంకా భాష అందలేదు. అప్పుడు అంతా కలసి మళ్ళీ సరస్వతిని ప్రార్థిస్తే, అప్పుడామె గోలోకంలో ఉన్న శ్రీకృష్ణపరమాత్మ శరీరాన్ని ఆవహించి, ఆ శరీరం నుంచి బయటకు వచ్చింది. శ్రీకృష్ణుని శరీరము నుండి బయటికి వచ్చినప్పుడు ఆమె సర్వశుక్ల. ఆపాదమస్తకం తెలుపు రంగుతో ఆవిర్భవించింది. తెల్లని చీర కట్టుకున్నది. తెల్లనిపువ్వులు పెట్టుకున్నది. తెల్లని శరీరంతో ఉన్నది. సమస్తము తెలుపే. అంటే సత్వగుణం నా లక్షణము అని లోకానికి చెప్పడం కోసం ఆ తల్లి, తెల్లని రూపు ధరించింది.

## సత్వగుణం యొక్క ప్రధాన లక్షణాలు ఏమేమిటి ?

శాంతముగా ఉండుట. ఎప్పుడూ క్రోధానికి గురికాకుండా ఉండుట. ఒకవేళ ఎవడైనా దోషం చేస్తే అటువంటి వారిని శిక్షించడానికి క్రోధం తెచ్చుకొనుట, ఆవేశింపచేసుకొనుట. నిజానికి క్రోధం ఉండదు అలా తెచ్చుకొనుట. ప్రతి ప్రాణినీ ప్రేమించుట. సకలసంపదలు ప్రసాదించుట. అన్నిటికీ మించి స్థితి, ఉండటానికి మూల కారణమైన శక్తిని ప్రసాదించుట. ఇవన్నీ కూడా సత్వగుణం లో భాగాలు. ఈ సత్వగుణం అనేది లేకపోతే ఇవాళ మనందరికీ ఈ శక్తులు ఉండేవి కావు. మనకి ఇంత అన్నం తినే అవకాశం ఉండేది కాదు. మాట్లాడే అవకాశం ఉండేది కాదు. అసలు సృష్టి అంతా ఎప్పుడో భస్మం అయిపోయి ఉండేది. ఇంద్రియ నిగ్రహం కూడా సత్వగుణం లో ఒక భాగం. అలాంటి సత్వగుణం తెల్లని కాంతితో దర్శనమిస్తుంది కనుక నేను సత్వగుణస్వరూపిణి అయిన సరస్వతిని అని లోకానికి చెప్పడానికి సరస్వతీమాత తెల్లని రంగుతో ఆవిర్భవించింది. వెంటనే శ్రీకృష్ణ పరమాత్ముడు ఓ జగన్మాతా ! సరస్వతీ! లోకశ్రేయస్సు కోసం నీవు మళ్ళీ నా శరీరం నుంచి ఆవిర్భవించావు. నీవు ఆవిర్భవించిన ఈ తిథి మాఘ శుక్ల పంచమి. అంటే మాఘమాసంలో శుక్లపక్షంలో పంచమీ తిథి నాడు నీవు ఆవిర్భవించావు. ఈ తిథిని నీ పుట్టినరోజుగా ప్రజలు జరుపుకుని తరింతురు గాక అని అని ఒక వరం ఇచ్చాడు. అంటే మాఘ శుక్ల పంచమినాడు సరస్వతీదేవి మొట్టమొదట రూపముతో దర్శనమిచ్చింది. అంతకు పూర్వం ఆవిడ ఆవిర్భవించినా, కాంతి తప్ప ఏమీ లేదు. ఈ సారి అలా కాదు. నాలుగు చేతులతో, తెల్లని వస్త్రంతో, తెల్లని పూలమాలతో, వీణతో ప్రత్యక్షమైంది. సరస్వతీదేవి ఆకారము ధరించి అవతరించినటువంటి తిథియే మాఘ శుక్ల పంచమి. అందుకే దీన్నే సరస్వతీపంచమి, సరస్వతీజన్మతిథి అన్నారు. తర్వాత ఆమె చాలా సార్లు ఆవిర్భవించింది. ఉదాహరణకు శుంభుడు, నిశుంభుడు అనే ఇద్దరు రాక్షసులను సంహరించడానికి మళ్ళీ మహాసరస్వతి మూలానక్షత్రంలో శరన్నవరాత్రులలో ఆశ్వయుజమాసంలో ఆవిర్భవించింది. అప్పుడు అవతరించింది అనగా మరొకసారి వచ్చింది కానీ అది పుట్టినరోజు కాదు. భూలోకమునకు రాక్షసవధ కోసం వచ్చింది. అందుకే మూలానక్షత్రం అంటే ఆమె జన్మతిథి అనకూడదు. శుంభ నిశుంభలను సంహరించుటకు భూలోకమునకు అవతరించినటువంటి తిథి. ఇది అలా కాదు పుట్టిన తిథి. అందుకే మనకి దుర్గా సప్తశతి యొక్క ధ్యానశ్లోకం లో

సేవే మహా పూర్వాం అత్ర సరస్వతీం అను భజే శుంభాది దైత్యార్దినీం! అని స్తుతించబడింది.

శుంభుడు మొదలైన రాక్షసులను సంహరించడం

కోసం సరస్వతీరూపం ధరించిన, అనగా మామూలు సరస్వతి కాదు మహా అను రెండక్షరములతో కూడిన సరస్వతీదేవిని సేవిస్తున్నాము అంటారు. అమ్మవారు మాఘ శుక్ల పంచమి నాడు ఆవిర్భవించింది. ఈవిడ దయ వల్ల దేవతలు వాక్కును పొందారు. భూలోకంలో కూడా ఈ తల్లిని చాలా మంది ఉపాసించారు. మాట్లాడడం మొదలుపెట్టారు. సంస్కృతం మొదలుకొని ఈ భూమి మీద ఉన్న అనేక భాషలన్నీ ఆ తల్లి యొక్క ప్రసాదం. కానీ కొంతమంది ఆ తల్లి ఆవిర్భవించినా మాట్లాడలేకపోవడం, ఇంకా వాళ్ళకి భాష రావడం లేదు. నోరు తిరగడం లేదు. అప్పుడు శ్రీకృష్ణుడు ఈ ప్రజల మీద జాలిపడి సరస్వతి వచ్చినది, కానీ మాట్లాడడానికి ప్రజలకు నాలుకకు కావాల్సిన శక్తి అందడం లేదు. ప్రతి ప్రాణీ మాట్లాడాలి. ఆఖరికి పశువులు, పక్షులు కూడా వాటి కూతల్లో మాట్లాడుకోవాలి. సైగల ద్వారానే కనీసం ఒకరి యొక్క అభిప్రాయాలును మరొకరు అందించుకోవాలి అనుకొని దీనికి ఏమి చేస్తే బాగుంటుంది అని కళ్ళు మూసుకొని ధ్యానం చేసాడు. అప్పుడు సరస్వతీదేవి ఆయనకు ధ్యానంలో కళ్ళు మూసుకుని ఉన్న సమయంలో ఆయన శిరస్సు పై భాగములో ప్రత్యక్షమై ఆయన హృదయానికో ఒక సందేశం ఇచ్చింది. అంటే సరస్వతీదేవి చెప్పిన సందేశం శ్రీకృష్ణుడు మనసుతో విన్నాడు. సరస్వతీదేవి ఇలా అన్నది - నాకోసం ఒక స్తోత్రమును తయారుచేయి. ఈ స్తోత్రమును భక్తులకు ప్రసాదించు. భక్తులు, మానవులు ఈ స్తోత్రమును చదివి పండితులైపోతారు. నువ్వు రచించిన ఈ స్తోత్రమును మానవులు చదివారా! వారికి నేను పాండిత్యమునిస్తాను. నా కోసం ఒక స్తోత్రము వ్రాయి అన్నది. అప్పుడు శ్రీకృష్ణుడు సరస్వతీ పూజని, సరస్వతీ స్తోత్రాన్ని రచించాడు. దానికే సరస్వతీ కవచము అని పేరు. అందుకే దేవీభాగవతం నవమస్కంధంలో ఆదౌ సరస్వతీ! పూజా...శ్రీకృష్ణేన వినిర్మితా!... మొట్టమొదట సరస్వతీపూజ శ్రీ కృష్ణ పరమాత్మ చేత రచింపబడినది. ఆయనే దాన్ని తయారుచేసాడు. ఆ తర్వాత కవచం రాసాడు. ఈ కవచం అత్యద్భుతమైన శక్తి కలిగినదన్నమాట.

ఓం ఐం హ్రీం క్లీం సరస్వత్యై స్వాహా! శిరో మే పాతు సర్వతః...... ఈ మంత్రములతో ప్రారంభమయ్యే స్తోత్రం సరస్వతీకవచం కేవలం 14 శ్లోకములు. ఈ 14 శ్లోకములు రచించి శ్రీకృష్ణుడు ఇలా అన్నాడు. ఓ! భూలోక వాసులరా! దేవతలారా ! సమస్తప్రాణులరా! నేను సరస్వతీకవచం అనే ఒక గొప్ప స్తోత్రమును రచించాను. ఇది చాలా శక్తిమంతమైనది. యుద్ధానికి వెళ్ళే వాడికి బాణం దెబ్బ తగలకుండా ఒంటికి ఎలా అయితే కవచం రక్షణ ఇస్తుందో, అలాగే మానవునికి వాక్కునకు కవచమై వాక్కును స్ఫుటముగా లోకానికి ఇవ్వడానికి, వాక్కు ద్వారా ఏదైనా సాధించడానికి పనికి వచ్చే ఒక కవచాన్ని నేను తయారు చేసాను. ఈ కవచం వాక్కునకు రక్షణ. మనుషులకు రక్షణ. ఈ కవచాన్ని భక్తి శ్రద్ధలతో పారాయణం చేసేటటువంటి వారు సరస్వతీకటాక్షం పొందుతారు. 40 రోజులపాటు విడిచిపెట్టకుండా పారాయణం చేసేవారు సకల శుభాలను పొందుతారు. మాఘ శుక్ల పంచమి నాడు ఆరంభించి, నలభై రోజులు పారాయణం చేసిన వారు మహా పండితులు అవుతారు. జీవితంలో ఐదులక్షల పర్యాయములు ఈ సరస్వతీ కవచమును పారాయణం చేసుకునేవారు ఇక సాక్షాత్తు సరస్వతి అయిపోతారు. బృహస్పతి సమో భవేత్. బృహస్పతికి ఎన్ని తెలివితేటలు ఉన్నాయో! అన్ని తెలివితేటలు వస్తాయి వారికి, అని వరం ఇచ్చాడు శ్రీకృష్ణుడు. సరస్వతీదేవి ఆవిర్భవించింది మాఘ శుక్ల పంచమి. ఆ రోజే శ్రీ కృష్ణుడు సరస్వతీ కవచం రాసాడు, సరస్వతీపూజావిధానం అందించాడు. ఈ విధానంతో మనం సరస్వతీమాతను మాఘ శుక్ల పంచమినాడు పూజించామంటే మనకి కూడా తిరుగులేని జ్ఞానం వస్తుంది. మహాపాండిత్యం వస్తుంది. ఎక్కడ, ఎప్పుడు, ఎలా ప్రవర్తించాలో తెలుస్తుంది. ఎవరితో ఎలా మాట్లాడాలో తెలుస్తుంది. ఆలోచనాశక్తి పెరుగుతుంది. ఆలోచన సరిగ్గా ఉంటే ప్రపంచమంతా మనకి దాసీభూతమవుతుంది. ప్రపంచం మనవశం అవ్వాలంటే, జగత్తును మన స్వాధీనం చేసుకోవాలంటే, ప్రాణులను ఆకట్టుకోవాలంటే, సరస్వతీకటాక్షం ఉండాలి. ఎప్పుడైనా

సరే అర్చనలు చేయాలనుకునేవారు బ్రాహ్మీ ముహూర్తం లో లేవాలి. లేచి తలారా స్నానం చేయాలి. స్నానం చేసాక నుదుటున కాస్త విభూతి గాని, ఊర్ధ్వ పుండ్రాలు గాని ధరించాలి, కుంకుమను కూడా ధరించాలి. సరస్వతీ పూజ చేసే వాళ్ళు, ఈ ఒక్క రోజైనా తెల్లని బట్టలు కట్టుకోవాలి. తెల్లని వస్త్రములు అంటే అమ్మకు చాలా ఇష్టం. కాబట్టి తెల్లని బట్టలు కట్టుకోండి. తెల్లని పువ్వులు సిద్ధం చేసుకోవాలి. శ్వేత గంధం (తెల్లచందనం) లేదా చందనం సిద్ధం చేసుకోవాలి. అమ్మవారి పటం లేదా అమ్మవారి విగ్రహాన్ని పెట్టుకోవాలి. ఈ విగ్రహానికి లేదా పటానికి ఎక్కడో ఓ చోట ఎదురుగుండా కూర్చుని ముందు విఘ్నేశ్వరపూజ చేసాక, ఆచమనము, సంకల్పము చెప్పుకుని, ఈ రోజు నేను నీ పూజ చేస్తున్నానమ్మా! సరస్వతీమాతా! అని మనసులో సంకల్పించండి. సరస్వతీమాతను వీలుంటే షోడశోపచారములతో అనగా పదహారు ఉపచారాలతో పూజ చేయండి. షోడశోపచారములు చేసే శక్తి మాకు లేదు అంటే కనీసం సరస్వతిని ఐదు పూజలతో సంతోషపెట్టండి. పంచ పూజలతో అందులో తప్పక చేయవలసింది గంధం. అమ్మవారికి ముందు గంధం ఇవ్వండి. ఆ తర్వాత పుష్పం ఇవ్వండి. ఈరోజు మాత్రం శుక్ల పంచమినాడు తెల్ల పువ్వులతో అమ్మను పూజించండి. మల్లె పువ్వులు, సన్నజాజి పువ్వులు, తెల్లచామంతులు, తెల్ల మందారాలు, నందివర్ధనాలు ఇలా ఏవి దొరికితే అవి తెల్లని పువ్వులతో పూజించండి. అమ్మవారి ధ్యానశ్లోకం ధ్యానం చేసుకోండి. కవచం చదవడానికి ముందుగా అమ్మని ధ్యానం చేసుకోండి.

యా కుందేందుతుషారహారధవళా యా శుభ్రవస్త్రాన్వితా

యా వీణావరదండమండితకరా యా శ్వేతపద్మాసనా |

యా బ్రహ్మాచ్యుతశంకరప్రభృతిభిర్దేవైః సదా పూజితా

సా మాం పాతు సరస్వతీ భగవతీ నిశ్శేషజాడ్యాపహా ||

ఈ శ్లోకం అత్యద్భుత శ్లోకం.

అమ్మ అనుగ్రహం ఉంటే మనకి ఎన్నిశుభాలు కలుగుతాయో ఇందులో చెప్పకుండానే చెప్పబడింది. అసలు ముందు తల్లి ఎలా ఉంటుందట ? మల్లెపువ్వులాగా, చంద్రునిలాగా, మంచులాగా, ముత్యాలహారం లాగా తెల్లగా ఉంటుందట. కుంద, ఇందు, తుషార, హార.

కుంద =మల్లె లేక మొల్ల ,

ఇందు =చంద్రుడు ,

తుషార =మంచు,

హార= ఇక్కడ ముత్యాల హారం అని చెప్పకోవాలి .

ఈ నాలుగు ఎలా తెల్లగా ఉంటాయో అమ్మ అలా తెల్లగా ఉంటుంది.

శుభ్ర వస్త్రాన్వితా!= తెల్లని బట్టలు ధరిస్తుంది.

శ్వేత పద్మాసన = తెల్ల తామర పువ్వు మీద కూర్చుంటుంది.

అందుకే ఈ రోజు తెల్ల తామర పువ్వులతో పూజించడం కూడా మంచిది. ఆవిడ చేతిలో వీణ ఉంటుంది. అభయ హస్తంతో ఉంటుంది. తెల్ల తామర పువ్వు మీద కూర్చుంటుంది. బ్రహ్మ, విష్ణువు, శివుడు మొదలైన దేవతల చేత సదా పూజిత, ఎల్లప్పుడూ పూజింపబడుతుంది .

సా =ఆ తల్లి ,

మాం =నన్ను ,

పాతు=రక్షింతుగాక.

ఎవరావిడ ? =సరస్వతి

పైగా ఆమె సామాన్యురాలా ? భగవతి .

నిశ్శేష జాడ్యాపహా != మందకొడితనాన్ని తొలగించే

మనలో ఉన్న మందకొడితనాన్ని పూర్తిగా తొలగించే తల్లి. మనలో చురుగ్గా పని చేసే లక్షణం లేకపోవడం ప్రమాదకరమైనది. కొంతమందికి పని అప్పజెప్పితే ఎప్పటికీ అవ్వదన్నమాట. అలాంటి మందకొడితనం పూర్తిగా తొలగిస్తుంది. మందకొడితనం అంటే జాడ్యం, వేగంగా పనిచేయలేకపోవడం, చురుకుదనం లేకపోవడం ఇవన్నీ తొలగించే తల్లి. పుష్పములు సమర్పించాక ఈ శ్లోకం చదువుకోవాలి. ధూపం ఇవ్వాలి. ధూపం వల్ల సంపదలు వస్తాయి. ఆ తర్వాత దీపం చూపించాలి. ఆ పై నైవేద్యం పెట్టాలి. కనీసం ఈ ఐదు పూజలైనా చేయాలి. కాబట్టి సరస్వతీదేవి యొక్క కవచం చదువుకోవాలి. సరస్వతీకవచం కేవలం 14 శ్లోకములు, ఆ కవచం ఈరోజైనా చదవాలి. ఏమీ చేయలేకపోతే కనీసం సరస్వతి యొక్క అష్టోత్తర శతనామాలైనా చదువుకోండి లేదా ఐదు నామములు చదువుతూ సరస్వతిని పువ్వులతో పూజించండి.

ఓం సరస్వత్యై నమః

ఓం వాగ్దేవ్యై నమః

ఓం వాణ్యై నమః

ఓం బ్రహ్మరాజ్ఞై నమః

ఓం బ్రహ్మ ణ్యై నమః

ఈ ఐదు నామములు సరస్వతికి చాలా ఇష్టము. ఈ ఐదునామములతో అమ్మ ఐదు పనులు చేస్తుందట. సృష్టి, స్థితి అంటే పోషించటం, సంహారం, తిరోధానం, అనుగ్రహం అనే పంచ కృత్యములు చేసే నామాలివి. సరస్వతీదేవి మొట్టమొదట దేవతల కోసం ఆవిర్భవించి, శ్రీ కృష్ణ పరమాత్మ శరీరం నుంచి జన్మమెత్తింది, అవతరించింది, అదే మాఘ శుక్ల పంచమి కథ. ప్రారంభంలో తెలిపిన సరస్వతీదేవి అవతార కథ ! ఆ కథని ఈ స్తోత్రాలు అయ్యాక, పూజ అయ్యాక వినండి. లేదా ఒకసారి మీరు చదవండి, ఈ కథను వింటున్నప్పుడు చేతిలో తెల్ల అక్షతలు పట్టుకోండి. అంటే పసుపు కలపని అక్షతలు చేతిలో పట్టుకోండి. ఈ అక్షతలు పట్టుకుని విన్నాక, ఈ అక్షతలు తీసుకుని అమ్మవారి పాదాల మీద వేయండి. ఆ అక్షతలు మీ శిరస్సును వేసుకోండి. అప్పుడు సరస్వతి యొక్క దివ్య అనుగ్రహం లభిస్తుంది. సరస్వతీ కటాక్షం ఎంతో గొప్పది. ఈ ప్రపంచంలో దేనినైనా సంపాదించుకోవచ్చు, కష్టపడి తపస్సు చేస్తే ధనము వస్తుంది. చదువు అంత తేలిగ్గా రాదు. ఈ మధ్యకాలంలో పిల్లల్లో అనేకములైన అవలక్షణములు వస్తున్నాయి. కాలప్రభావం అయినా లేదా కలిప్రభావం అయినా పిల్లల్లో చురుకుదనం తగ్గిపోతోంది లేదా మాటలు తగ్గిపోతున్నాయి, అలా స్తబ్దంగా ఉండి పోతున్నారు. చిన్నప్పటి నుంచే కంప్యూటర్ లు చూడటం వల్లనో, ఫోన్లు చూడటం వల్లనో చాలామంది ఇళ్లలో పిల్లలు చురుకుగా మాట్లాడలేకపోతున్నారు, నోరు తిరగడం లేదు. మరీ ముఖ్యంగా అమెరికాలో చాలామంది పిల్లల్లో మూడు, నాలుగు సంవత్సరాలు వచ్చినా మాటలు రావడం లేదు. పిల్లలు మూగవాళ్ళలా ఉండిపోవడం, మాట్లాడలేకపోవడం అనేది మహా భయంకరమైన బాధ. అలాంటి వాళ్లకి ఈ సరస్వతీపూజ అపూర్వమైనది. అటువంటి వాళ్ళు ఏం చేస్తారంటే, మాఘ శుక్ల పంచమి నాడు పిల్లాడికి తలారా స్నానం చేయించండి. ముందు విఘ్నేశ్వర పూజ చేయాలి. "ఆదౌ పూజ్యో గణాధిపః" అని శాస్త్రం. తెల్లపువ్వులతో సరస్వతిని పూజించండి. ఇక్కడే ఈ చిన్నపిల్లలతో పూజ ఎలా చేయించాలనే గొప్ప విషయం ఒకటి ఉంది. అమ్మ పాయసాన్నప్రియ. సరస్వతీదేవికి పాయసం అంటే చాలా ఇష్టం. చిక్కని పాలతో బెల్లం , జీడిపప్పు వేసి పాయసం తయారుచేయించి సరస్వతీదేవికి ఆ పాయసాన్ని మీరే నివేదన చేసి, మీ పిల్లవాడిని ఆ సరస్వతీదేవి పటం దగ్గరో లేదా విగ్రహం దగ్గరో కూర్చోబెట్టండి. పిల్లవాడి చేత చేమంతి పువ్వులు కాని, తామర పువ్వులు కాని, కలువ పువ్వులు కాని తెల్లరంగులో ఉండే పువ్వులతో పిల్లవానిచేత అర్చన చేయించండి. సరస్వతీకవచం మీరు చదువుతూ వాళ్ళ చేత ఒక్కొక్క పుష్పం సరస్వతీదేవి పాదాలవద్ద

వేయించండి. 108 పువ్వులుగాని లేదా 27 పువ్వులుగాని, ఏమీ దొరకపోతే 9 పువ్వులతో నైనా సరస్వతీదేవిని పూజించాలి. అసలు పువ్వులు దొరకకపోతే , తెల్లని వెండి పువ్వులు దొరకడం కష్టమేమీ కాదు, వాటితోనైనా అర్చన చేయించండి. అర్చన అయ్యాక ఈ పాయసం కొంచెం ప్రసాదముగా సరిగ్గా చదువు లేదా మాటలు రాకుండా బాధ పడుతున్నటువంటి మీ అమ్మాయికో, అబ్బాయికో తినిపించండి, లేదా మిగతావారికి కూడా కొంత ప్రసాదంగా పెట్టండి. తప్పనిసరిగా పిల్లాడూ తినాలి, మీరూ తినాలి. ఆ తదనంతరం పెద్ద తెల్ల తువ్వాలు, అందులో కాస్త బియ్యం, కొంచెం దక్షిణ ఇవన్నీ వేసి మీ కులపూరోహితులకో, అర్చకులకో దానం చేయాలి. దీనివల్ల పిల్లల్లో ఉన్న భయంకరమైనటువంటి జాడ్యం పోతుంది. చురుకుదనం వస్తుంది, విద్య వస్తుంది. దీన్ని కృష్ణపరమాత్ముడు చెప్పాడు. మార్కండేయపురాణంలో కూడా ఇదే విషయం చెప్పారు. నిజంగా సరస్వతీకటాక్షం పొందడానికి ఇది చాలా అవసరం. ఎక్కడైనా సరస్వతీమాతకు సంబంధించిన ఆలయములుంటే మీరు, మీ పిల్లలు అందరూ వెళ్ళి ప్రదక్షిణం చేయండి. ఆలయంలో ప్రదక్షిణల వల్ల లాభమేమిటో తెలుసా ?

> యానికానిచ పాపాని జన్మాంతర కృతానిచ
>
> తాని తాని ప్రణశ్యంతి ప్రదక్షిణ పదేపదే

ఈ జన్మలో, ఇంతకు పూర్వజన్మలో మానవులు పాపములు చేసారు. కాబట్టి ఈ కష్టాలు వస్తున్నాయి. కష్టాలు అన్నీ ఈ ప్రదక్షిణలవల్ల పోతాయి అంటే అమ్మవారి చుట్టూ ఆలయం చుట్టూ ప్రదక్షిణం చేస్తూ ఉంటే, మనం చేసిన పాపాలు అడుగు తీసి అడుగువేసినప్పుడల్లా పోతాయి. మనం చేసిన మహాపాపములు నశిస్తే వాక్ శుద్ధి లభిస్తుంది. వాక్ శుద్ధి లభిస్తే ప్రపంచంలో ఏ పనైనా చేయగలుగుతాం. తర్వాత దీపం దానం చేయడం కూడా ఈ రోజు చాలా మంచిది. ఒక వెండి ప్రమిదయో, బంగారు ప్రమిదో, ఇత్తడి ప్రమిద గాని, మట్టి ప్రమిదైనా సరే తీసుకోండి. ఈ ప్రమిదలో ఆవునెయ్యి పొయ్యండి. అందులో మూడు ఒత్తులు వేయండి. దాన్ని వెలిగించండి, వెలిగించి అమ్మవారికి చూపించి తదనంతరం దీనిని దక్షిణతో ఎవరైనా పుణ్యాత్మునికి దానం చేయండి. దీపదానం చేయటంవల్ల పిల్లలకు ధారణాశక్తి పెరుగుతుంది. జ్ఞాపకశక్తి పెరుగుతుంది. వాళ్ళు కంఠస్థం చేయగలుగుతారు. వాక్కుకు కూడా శుద్ధి వస్తుంది. స్ఫుటంగా పలుకలేనివాళ్ళు, స్పష్టంగా కొన్ని శబ్దాలు ఉచ్చరించలేనివాళ్ళు దీనివల్ల అద్భుతంగా మాట్లాడడం మొదలుపెడతారు. అన్నిటికీ మించి సరస్వతీమాత మాఘశుక్ల పంచమినాడు మాతృరూపంలో విహరిస్తుంది. అందుకే పూర్వకాలంలో పిల్లల్ని, మీ అమ్మ గారిలో సరస్వతి ఉంటుంది. కాబట్టి మాతృప్రదక్షిణ చేయి అనేవారు. మాఘ శుక్ల పంచమినాడు లేదా సరస్వతీ జన్మతిథి నాడు తల్లి చుట్టూ పిల్లలు ప్రదక్షిణ చేస్తే, దాని వల్ల కూడా భయంకరదోషములు పోయి మహాతపస్సు చేసిన ఫలితం పొందుతారు. చేతిలోకి కాసిని నీళ్ళు తీసుకుని అక్షతలును, ఏతత్ ఫలం శ్రీ సరస్వతీ పాదారవిందార్పణమస్తు అని కింద విడిచిపెట్టి, సరస్వతిని పూజించిన పువ్వులలో ఒకపువ్వును తీసుకుని కళ్ళకద్దుకుని శిరస్సున పెట్టుకోండి. ఆడపిల్లలు జడలో పెట్టుకుంటే దాని వల్ల కూడా సరస్వతీకటాక్షం లభిస్తుంది. కథ విన్నాక అమ్మవారి పాదాల చెంత విడిచిపెట్టినవి తరువాత శిరస్సున చల్లుకోండి. పిల్లలకు కూడా వేయండి. దానివల్ల పిల్లలకు అనేక శుభాలు కలుగుతాయి

సరస్వతీకటాక్షం అందరూ కూడా పొంది శుభం, ఆనందం, సుఖం, శాంతి వీటితో ప్రవర్ధిల్లుదురుగాక....

## శ్రీ ప్రణవపీఠ సత్సంగ సమాచారం

శ్రీరస్తు శుభమస్తు అవిఘ్నమస్తు

భక్తులకు విజ్ఞప్తి,

ఫిబ్రవరి 2022, మాఘ మాసం, 15-02-2022 మంగళవారం నుండి 16-02-2022 బుధవారం వరకు శ్రీ ప్రణవపీఠం 9వ వార్షికోత్సవ కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుంది.

ఉత్సవములలో భాగంగా గణపతిపూజ, మండపారాధన, అమ్మవారికి విశేష కుంకుమ పూజ, అంబాయాగం, త్రిమాతా సహిత యాగము, శ్రీ పుత్రదేశ్వర లింగప్రతిష్ఠ, ముగ్గురు అమ్మవార్లకు వివిధ ద్రవ్యములతో అభిషేకములు, కుంకుమార్చన, నీరాజనం, అమ్మవారికి స్వర్ణ కవచాలంకారదర్శనం, ప్రధాన ఆలయ విమానమునకు భూరి కార్యక్రమము (బూరెల నివేదన), పల్లకీసేవ వంటి అనేక కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుంది.

శ్రీ ప్రణవపీఠ ప్రాంగణములో అద్భుతంగా జరుగబోతున్న కార్యక్రమములందు భక్తులు పాల్గొని కార్యక్రమములు కనులారా తిలకించి, శ్రీ లలితా పరాభట్టారికాదేవి యొక్క (పీఠంలో వేంచేసియున్న దేవతల) సంపూర్ణ అనుగ్రహాన్ని పొందాలని మనస్ఫూర్తిగా అందరినీ ఆహ్వానిస్తున్నాము.

ఇట్లు,

శ్రీ ప్రణవ పీఠం శిష్య బృందం